ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 13

## దక్షిణ



**దైవము, గురువు, సత్పురుషుల ఎడల మన హృదయములో గల పూజ్యభావము, ప్రేమ, శ్రద్ధలను వ్యక్తం చేసేందుకు సమర్పించేదే దక్షిణ. సంస్కృతంలో దక్ష అంటే శ్రద్ధ అని అర్థము. మన హృదయాలలో అట్టి పూజ్యభావము** 35
**లేకుండా బాహ్యంగా సమర్పించబడిన దక్షిణ ఎంత పెద్ద మొత్తమైనా నిరర్థకమే. మన హృదయాలట్టి పూజ్య భావముతోను ప్రేమతోనూ నిండియున్నప్పుడు మన కానుకెంత చిన్నదైనా స్వీకరించే వారికదెంతో గొప్పదిగా వుంటుంది.**

అందుకే గీతలో 'భక్తితో సమర్పించిన పత్రం, పుష్పం, ఫలం, నీరు...... నేను ప్రీతితో స్వీకరించుచున్నాను అని' శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు.

సర్వాన్ని నడిపేది ఆ భగవంతుడేనని, ఆయనే భక్తపాలన కొరకు ప్రజలకు ధర్మబోధ చేయుటకు వివిధ మహాత్ముల రూపంలో భూమిపై అవతరిస్తుంటారని గుర్తించడమే శ్రద్ధాపూర్వకమైన భక్తి. ఈ సత్యాన్ని తమ భక్తులు గుర్తించగలందులకే శ్రీస్వామివారు అప్పుడప్పుడూ తమ భక్తుల నుండి దక్షిణ కోరి తీసుకునేవారు. దానికితోడు ఒక్కొక్క భక్తుని పరిస్థితిని బట్టి ఆయన కోరే దక్షిణకు మరెన్నో అర్థాలు, ప్రత్యేకతలు గూడా ప్రకటమౌతాయి.

జనవరి 1980 లో తులశవ్వను పదకొండు దుప్పట్లు దక్షిణగా సమర్పించమన్నారు శ్రీస్వామివారు. శ్రీ సాయి కూడా ఆధ్యాత్మిక సత్యాలను బోధించదలచినప్పుడు దక్షిణ కోరడం ద్వారా వారు వదలవలసిన దుర్గుణాల సంఖ్యను తెలిపేవారు. శ్రీస్వామివారు తులశవ్వ నుండి కోరింది 5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, మనస్సు మొత్తం 11. ఆత్మజ్ఞానాన్ని ఆవరించి బ్రహ్మం నుండి మనలను పరిమితులుగా చేసియున్న ఈ 11

ఆవరణలను (దుప్పట్లను) తనకు సమర్పించి బ్రహ్మంతో ఐక్యమవమని శ్రీస్వామివారి భావం కాబోలు!

స్వామి:- నా తొమ్మిది దుప్పట్లు నాకివ్వండయ్యా

బి. నాగయ్య :- స్వామీ! తమకుండేది ఆరు దుప్పట్లేగదా? తొమ్మిదెక్కడివి? ఇదిగో మీ ఆరు దుప్పట్లు తీసుకోండి.

స్వామి :- ఆహా....... ఆ తొమ్మిది దుప్పట్లు నా కివ్వండి.

నాగయ్య ఆ ఆరు దుప్పట్లకు టవల్సు మూడు కలిపి లెక్కకు తొమ్మిది చేసిఇచ్చాడు.

స్వామి :- ఇదేందయ్యా! గోచీ గుడ్డలిచ్చావు? నాయి పెద్ద దుప్పట్లు గదా?

నాగయ్య తన దుప్పటి, రోశిరెడ్డి దుప్పటి, గురవయ్య దుప్పటి కలిపి తొమ్మిదిచ్చాడు.

స్వామి :- ఆ..... అద్ది! సరిపోయింది. అంతే! అంతే! అన్నారు.

36 **పంచభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారము అనే అష్టవిధ ప్రకృతులు వాటి కాధారమైన పరమాత్మతత్వము ఈ మొత్తమూ కలసి భగవంతుడు.** అన్నింటినీ భగవత్ స్వరూపుడైన శ్రీస్వామివారుగా గుర్తిస్తూండడమే తొమ్మిది దుప్పట్లనూ ఆయనకు సమర్పించడం అని వారి భావం గాబోలు.

37 **మరొకప్పుడు తులశవ్వనుద్దేశించి శ్రీస్వామివారు, 'ఆరు దుప్పట్లు గుండములో వేయమ్మా' అని పదే పదే ఆదేశించారు. అరిషడ్వర్గాలనే ఆరు దుప్పట్లను కాల్చివేయమన్నారేమో అనిపిస్తుంది.**

**నిజమైన భక్తి ప్రేమలకే శ్రీస్వామివారు విలువనిస్తారుగాని మనం**
38 **సమర్పించే వస్తువులకు మాత్రం కాదు. భక్తి ప్రేమలు లేకుండా లోకం కొరకు, తోటివారిలో గొప్ప అనిపించుకొనుటకూ, మన హోదా నిలుపుకొనుటకూ సమర్పించిన వస్తువులు ఎంత విలువైనవైనా, శ్రీస్వామివారి దృష్టిలో అవి కాకిరెట్టవంటివే.**

నన్ను (రచయిత) శ్రీస్వామివారు ఆయాసం బాధ నుండి విముక్తుని చేసినందుకు కృతజ్ఞతతో తలుపూరులో ప్రతిరోజూ నాలుగిడ్లీలు కొనుక్కొచ్చి

స్వామివారికి సమర్పించేవాడను. మార్గమధ్యంలో షిరిడీ సాయి నామముయేమారక జపిస్తూండేవాడను. ఒకనాడు జేబులో పదిపైసలే వున్నది. దానితో ఒక ఇడ్లీ తేవడమా లేక అప్పుపెట్టి నాలుగు ఇడ్లీలూ తేవడమా అనే ఆలోచనతో మార్గమంతా గడిపాను. నాలుగు తేకుండా ఒక్కటిగా సమర్పించడం తక్కువగా వుంటుందని అప్పుచేసి నాలుగు తెచ్చి సమర్పించాను. ఎంత బ్రతిమాలినా శ్రీస్వామివారు అవి తాకనుగూడా లేదు. నామజపం ఆగిపోయింది. మరీ ఒక్క ఇడ్లీ సమర్పించడం చిన్నతనమని అప్పు చేయడమే శ్రీస్వామివారికి సమ్మతం కాలేదు. కనుకనే వారు ముట్టలేదు.

పండుగకు, యాత్రకు, పబ్బానికి, మరే పవిత్ర కార్యానికి అప్పు చేయకూడదని శ్రీ షిరిడీ సాయి కూడా భక్తులకు బోధించారు.

ఒకరోజు కలిచేడు హిందీపండిట్ మస్తాన్‌సాహెబ్‌గారు శ్రీస్వామివారికి రెండు రూపాయలు సమర్పించి నమస్కరించాడు. 'ఈయనకు ఇరవై ఆరు రూపాయలు రావలెనని వ్రాసి ఇయ్యయ్యా!' అన్నారు శ్రీస్వామివారు. మూడు నెలల తరువాత వారికి ప్రభుత్వము వారు చాలాకాలంగా పెండింగులో వుంచిన అడిషనల్ ఇంక్రిమెంట్ రూ. 26/- లు మంజూరైనది! శ్రీస్వామివారికి దక్షిణ సమర్పించిన నెల నుంచీ ఇంక్రిమెంటు ఆమోదించడమే ఆశ్చర్యం.

శ్రీస్వామివారు కొంతమందికి ఇంత డబ్బు పెడితేగాని మాటరాదని చెప్పేవారు. ధనాశపరులు, లోభులు శ్రీస్వామివారికి డబ్బు పిచ్చునుకునేవారు. పరిశుద్ధమైన వారి వైరాగ్య జీవిత విధానాన్ని పరిశీలించినవారికిగాని శ్రీస్వామివారికి ధనమంటే ధాన్యపుగింజంత విలువగూడా లేదని తెలియదు. ఆయన ధనమేనాడు దాచుకొని యెరుగరు. సాయంకాలానికల్లా సేవకులకు వారి వారి కష్టాన్ని, అవసరాన్ని బట్టి పంచేసేవారు. కొందరు దక్షిణ సమర్పించినా స్వీకరించేవారు కారు.

కొన్ని కారణాలవల్ల శ్రీ రామయ్య తన ప్రక్క చేనుకంటే ఆలస్యంగా 'రాగి' పైరు పెట్టారు. చేలో పదును లేదు గనుక చక్కగా మొలవదని భయపడి, రాగిపైరు బాగా పండితే శ్రీస్వామివారికి పుట్టికి ఒక తూము రాగుల చొప్పున సమర్పించుకుంటానని మ్రొక్కుకున్నాడు. చేను అనుకున్న దానికంటే ఎక్కువగా పండింది. తాను మ్రొక్కుకున్న రాగులలో కొన్ని ఇచ్చాడుగాని కొన్ని ఇవ్వలేదు.

ఆ సంగతి మరచిపోయి రెండు సంవత్సరాలు గడిచాయి. ఎప్పుడో గుర్తొచ్చినప్పుడు మాత్రం బాధపడేవాడు. ఒకరోజు శ్రీస్వామివారిని దర్శించి నమస్కరించాడు. శ్రీస్వామివారు తమలో తాము 'ఆ రాగులు అట్లాగే పోయాయి!' అని రెండు మూడు మార్లు పెద్దగా, అనుకొంటున్నారు. ఆ మాటలు తన మ్రొక్కును గురించేనని గుర్తించాడు. పరిహారంతో సహా ఆ రాగుల ఖరీదును వెంటనే శ్రీస్వామివారికి సమర్పించాడు.

శ్రీ సాయినాధునివలె శ్రీస్వామివారు తనకు రావలసిన మ్రొక్కుబడులు అడిగి పుచ్చుకొనేవారు. ఒక్కొక్కప్పుడు దక్షిణ పైకం చిన్న చిన్న మొత్తాలుగా అనేకమార్లు అడిగి పుచ్చుకొని రావలసిన మొత్తం పూర్తియైన తరువాత ఇక ఒక్క పైసా కూడా తీసుకునేవారు కాదు.

ఒకప్పుడు దక్షిణాది నుండి వచ్చిన రైతు కూలీ రూ. 2/- పెట్టి ఏదో ప్రశ్న అడిగాడు. శ్రీస్వామివారు ఒక్కమాట చెప్పి 'ఇక మాటరాదు, మరలా దక్షిణ పెట్టమన్నారు'. ఇలాగే అనేక మార్లు దక్షిణ అడిగి అతని వద్దనున్న పైకమంతా చార్జీకి కూడా లేకుండా తీసుకున్నారు. చిట్టచివర అతనికి చీటీ వ్రాయించి ఇచ్చారు. తరువాత అతనికి చార్జీలకు కూడా పైకంలేని సంగతి ఎరిగే శ్రీస్వామివారు అతనికి రూ. 6/- లు ఇచ్చి పంపారు.

కడప జిల్లా నుండి ఒక భక్తుడు దర్శనార్థం రాగానే శ్రీస్వామివారు అనేక పర్యాయాలు దక్షిణ అడిగి అతని దగ్గర ఒక్క పైసా లేకుండా తీసుకున్నారు. ఇదంతా మన మంచికేనని ఆ భక్తుడు చాలా సంతోషంగా జోబీ ఖాళీ చేశాడు. శ్రీస్వామివారి ఆశ్రమంలో భోంచేసి సెలవు తీసుకొని తన గ్రామం బయలుదేరాడు. చేతిలో పైసాలేదు. బస్సులో శ్రీస్వామివారు తనకేదో ఒక విధంగా చార్జి డబ్బు సహాయం చేస్తారని తలచాడు. చిత్రంగా తాను మూడు బస్సులు, ఒక పడవలో ప్రయాణం చేసినా ఒక్కరు గూడ తనను చార్జి ఇమ్మని అడుగలేదట. ఈ విషయాన్ని అతడు తన స్నేహితులందరికీ ఆశ్చర్యంతో వెల్లడి చేశాడు.